RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



## రూపాయి బలోపేతానికి ఆర్‌బీఐ చర్యలు




## అమెజాన్‌లో భారీగా ఉద్యోగాల కోత

రోబోలతో పనిచేసేలా ప్లానింగ్

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :23 | గురువారం 23 అక్టోబర్ 2025 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in

## బంగారం వెండి ధరల్లో దిద్దుబాటు



**బంగారం 9వేలు. వెండి 7వేల తగ్గుదల**

ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు

## గాలి మాటలతో ఎంతకాలం మోసం

మాటలు ఘనం..పాలన ఆచరణలో శూన్యం

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు





## కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

సిద్దిపేట: ,మనసాక్షి:భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తో మాజీ మంత్రులు కేటీఆర్ హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ఈ సమావేశం జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రోడ్‌షోలు, ప్రచార వ్యూహాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపైనా వారు చర్చిస్తున్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లోని వివిధ ప్రాంతాల ఇన్‌ఛార్జ్‌లతో గురువారం కేసీఆర్ సమావేశం కానున్నారు. ప్రచార వ్యూహాలపై వారికి ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

## ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం



**హైదరాబాద్,మనసాక్షి:** సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాయదుర్గం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో గ్లోబల్ ఈవెంట్స్ ఆఫ్ పయనీరింగ్ అండ్ అడ్వాన్సింగ్ క్వెస్ట్ (జియో ప్యాక్) ఆధ్వర్యంలో బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్-2025 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన పరిశోధన సంస్థలు, పరిశ్రమలు హైదరాబాద్‌లో స్థాపించి బీజం వేశారని అన్నారు. నాటి నుంచి బీడీఎల్, డీఆర్‌డీవో, రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ తదితర ప్రఖ్యాత సంస్థలు అభివృద్ధి చేస్తూ వస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో నగరంలో ఐఐటి, ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ, ఉస్మానియా యూనివర్సిటీ వంటి విద్యా సంస్థలు శాస్త్ర సాంకేతిక రంగాలకు దన్నుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫార్మా, ఐటీ, రక్షణ వంటి అనేక రకాల క్లస్టర్స్‌లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయన్నారు. అంతరిక్షరంగంలోనూ క్లస్టర్ ఏర్పాటు చేసి ఆ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జియో ప్యాక్ సీఈఓ,



# వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా ఉస్మా 'నయా'

- రెండేళ్లలో కొత్త భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ
- పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

- ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు
- ఆస్పత్రికి అసవరమైన వైద్య పరికారలు సిద్ధం చేయాలి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

**నేడు తెలంగాణ కేబినేట్ భేటీ**

బిసి రిజర్వేషన్లు.. స్థానిక ఎన్నికలపై చర్చ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్లా..?

### దౌర్భగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు : బండిసంజయ్ ఫైర్



**హైదరాబాద్:,మనసాక్షి:** పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడించారు.



## తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత

- సిఎం ఆదేశాలతో తక్షణ చర్యలు
- ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం
- నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు

## సకాలంలో మేడారం మహాజాతర ఏర్పాట్లు



## బంగారం వెండి ధరల్లో దిద్దుబాటు

హైదరాబాద్ రికార్డు ధరలతో ఇటీవల ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు తాజాగా దిగొస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం పసిడి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.9వేలకు పైగా తగ్గడం గమనార్హం. అటు వెండి ధర కూడా దిగొచ్చింది. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 గ్రాముల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,25,250కి పడిపోయింది. 22 క్యారెట్ల ధర రూ.1,14,843గా ఉంది. ఇక వెండి ధర దాదాపు రూ.7వేలు తగ్గింది. నేడు కేజీ వెండి ధర రూ.1,58,000 పలుకుతోంది. వెండి ధర వారం రోజుల్లో దాదాపు రూ.28వేలు తగ్గింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 47.84 డాలర్లకు చేరింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## తిరుమలలో కుండపోత వర్షం

తిరుమల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుమలలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో భక్తులు తడిసి ముద్దవుతున్నారు. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. తిరుమల మాడవీధులన్నీ జలమయం అయ్యాయి. భక్తులు వర్షంలో తడుస్తూనే దర్శనాలకు పరుగెత్తారు. కుండపోత వర్షానికి చలి తోడు కావడంతో భక్తులు వణికి పోయారు. వర్షం ప్రభావం నేపథ్యంలో ఘాట్ రోడ్‌లో ప్రయాణించే వాహనాల డ్రైవర్లను తితిదే అప్రమత్తం చేసింది. వర్షం ప్రభావం నేపథ్యంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఇకపోతే వర్షం కారణంగా తిరుగిరులు సరికొత్త శోభ సంతరించుకున్నాయి. శేషాచలం అటవీ ప్రాంతంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలతో ఒకటో కనుమరహదారిలో ఉన్న మాల్వాడి గుండం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అలిపిరి శ్రీవారి పాదాల చెంత ఉన్న కపిలతీర్థం జలపాతం భక్తులకు కనువిందు చేస్తోంది. ఏడుకొండల్లో పరచుకొన్న పచ్చదనం.. ఎత్తైన ప్రాంతం నుంచి దూకుతున్న జలపాతాలు భక్తులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తున్నాయి. కపిలతీర్థం

వద్ద జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పుష్కరిణిలో భక్తులను స్నానానికి అనుమతించడం లేదు. అయితే జలపాతాలను వీక్షించేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

## అమెజాన్‌లో భారీగా ఉద్యోగాల కోత

వాషింగ్టన్: 2033నాటికి అమెజాన్ ఐదులక్షల మంది ఉద్యోగులను రోబోలతో భర్తీ చేయనుంది. అంతర్గత పత్రాలు, సమీక్షించిన ఇంటర్వ్యూలను ఉదహరిస్తూ జాతీయ మీడియా మంగళవారం ఈ అంశంపై ఒక నివేదికను ప్రచురించింది. 2027 నాటికి యాంత్రీకరణ 1,60,000 అదనపు ఉద్యోగాలను నివారించగలదని సంస్థ విశ్వసిస్తోందని పేర్కొంది. దీంతో అమెజాన్ ఉద్యోగుల నియామకాల వేగాన్ని తగ్గించనుందని నివేదిక తెలిపింది. అమెజాన్ రోబోటిక్స్ బృందం కంపెనీ మొత్తం కార్యకలాపాల్లో 75శాతం యాంత్రీకరణను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ చర్య ఇప్పటి నుండి 2027 వరకు సంస్థ 12.6 బిలియన్ డాలర్లు (సుమారు 1105 కోట్లు ) ఆదా చేసేందుకు అనుమతిస్తుంది. వినియోగదారులకు అందించే ఒక్కో వస్తువుపై 30 సెంట్లు ఆదా చేయగలదని పేర్కొంది.

## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

## అత్యాచారలకు పాల్పడితే కఠిన శిక్షలు

అమరావతి: అత్యాచార ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాలలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. తుని రూరల్ గురుకుల పాఠశాల విద్యార్థినిపై తాటిక నారాయణరావు అనే కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలుసుకొని షాక్‌కు గురయ్యానని తెలిపారు. సంఘటన వివరాలు తెలిసిన వెంటనే పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. బాధితురాలు ధైర్యంగా ఉండేలా కౌన్సిలింగ్ ఇచ్చి, అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థినిలకు పటిష్టమైన భద్రత కల్పించాల్సిందిగా అధికార యంత్రాంగానికి మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. తుని గురుకుల పాఠశాల విద్యార్థినిపై నారాయణ అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించడం తీవ్ర కలకలం రేపింది. స్కూల్ నుంచి బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన కామాంధుడు.. ఓ నిర్మానుష్య ప్రాంతంలో మైనర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నిలదీయగా నిందితుడు పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు నారాయణను అదుపులోకి తీసుకున్నారు. తుని ఘటనపై పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు స్పందిస్తూ.. నారాయణరావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్, అత్యాచారం కిందకు వచ్చే వివిధ కఠిన సెక్షన్లు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేశామని.. సాయంత్రానికి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఏ పార్టీలకు సంబంధం లేదని.. సోషల్ మీడియాలో పార్టీల మధ్య గొడవలు సృష్టించేందుకు వీడియోలు వైరల్ చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు.

# తెలంగాణ రవాణా చెక్ పోస్టుల ఎత్తివేత



హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించు కోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు

అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్?డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్?పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

# వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా ఉస్మా'నయా'



హైదరాబాద్: గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక

సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## గాలి మాటలతో ఎంతకాలం మోసం

హైదరాబాద్: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు ఘనంగా ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యం అని ఆయన అన్నారు. గాలి మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య అని హరీష్ రావు పేర్కొన్నారు. చిన్న ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం సర్కార్‌కు ఎందుకు సాధ్యం కాకపోతుందో విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్లు వేతనాల కోసం నెలలుగా ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని హరీష్ రావు తెలిపారు. ఈ పరిస్థితి ద్వారా ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులు మానసికంగా హానికరంగా ఎదురవుతున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉన్నదని ఆయన విమర్శించారు. 'కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం నిలిపివేయబడింది. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా, అమలు గాలికి వదిలివేశారు. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా?' అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో గాలి మాటలకు గురి చేస్తే ఉద్యోగులను మోసం చేయడం అనైతికమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చెలించిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు కూడా తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి ఆహ్వానించారు. ఈ పరిస్థితి ద్వారా సర్కార్ సొంత మాటల మాయాజాలంలో మిగిలిపోకుండా, ఉద్యోగుల హక్కులను గౌరవించాల్సిన అవసరం ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

# సకాలంలో మేడారం మహాజాతర ఏర్పాట్లు

హైదరాబాద్ మేడారం మహాజాతర ఏర్పాట్లపై సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150.00 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90.00 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు ఉద్దేశించారు. ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ఎ÷-లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర్ గారితో కలిసి మాట్లాడుతూ మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్?3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించబడింది. జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్ను నియమించనున్నారు.24 శాశ్వత టవర్స్, 20 సెల్-ఆన్-వీల్స్, 350 వై-ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.కోర్ రూట్లు మరియు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (1050 ఎకరాలు) గుర్తించబడి, దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుంది. ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో కచ్చా నుండి డబుల్ లేన్ రూపంలో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయి. ఆర్ / బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ



రహదారులు, మరియు 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నాయి. జాతర సమయానికి ముందు, మధ్య మరియు తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. 517 బోరుపాయింట్లు/నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయి. స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. జంపన్న వాగు పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. 9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టింది. జాతర ప్రాంతమంతా ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క?సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని శ్రీ సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. మావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ శ్రీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కూటమి వచ్చాక పెట్టుబడుల వెల్లువ

అమరావతి: కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి రూ.7.65 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా 7.28 లక్షల ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్బన్ ప్రాంతాల్లో వచ్చే నెల 5 వరకు అర్హుల ఎంపిక ప్రక్రియ కోసం సర్వే చేపడుతున్నాం. పట్టణాల్లో ఇళ్లు లేని పేదలు వచ్చేనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 'ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై 75.1 శాతం ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని సర్వేలో తేలింది. ఇప్రభుత్వంలో ఎక్కడైనా, ఏదైనా తప్పు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు. కొన్ని పత్రికలు కావాలనే తప్పుడు రాతలు రాస్తున్నాయి. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీపీపీ విధానం అమలుపై వైకాపా నిరసనలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మంత్రి పార్థసారథి అన్నారు.

## 23 నుంచి కేంద్ర ప్రభారీ అధికారి పర్యటన

విజయవాడ:జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఉన్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో పర్యటించి.. లక్ష్యాల సాధనలో పురోగతిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభారీ అధికారి / నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ నేలపట్ల అశోక్‌బాబు ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. నెల 23వ తేదీన పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలుతో పాటు ముండ్లపాడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యటించనుండగా.. 24వ తేదీన ఇబ్రహీంపట్నం మండలంలో ఇబ్రహీంపట్నంతో పాటు కాచవరం,

కేతనకొండ, కొండపల్లి, జూపూడి, గుంటుపల్లి గ్రామాల్లో రోజంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు, అంగన్వాడీ కేంద్రాలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అదేవిధంగా మండలస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారు.

# యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించేందుకే మెగా జాబ్ మేళా

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట,అక్టోబర్ 22,మన సాక్షి:**




గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకుగాను ఈ నెల 25న హుజూర్నగర్ లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఇంజనీరింగ్, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, యాజమాన్యాలు ఎక్కువ మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరయ్యే విధంగా చూడాలని ఆయన కోరారు.

బుధవారం ఆయన సూర్యాపేటలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంజనీరింగ్ , డిగ్రీ , పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లతో జాబ్ మేళా పై ఏర్పాటుచేసిన ముందస్తు సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్థికంగా వెనుకబడిన వారు ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, అయితే ఉద్యోగఅవకాశాలు లేకపోవడం, అవగాహన రాహిత్యం వల్ల వారు ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి నల్గొండ నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఎక్కువ మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న దృఢసంకల్పంతో ఉందని తెలిపారు.

గడచిన 20 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 70 నుండి 75 వేల మందికి కొత్త ఉద్యోగాలు కల్పించామని, పరిశ్రమల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ హుజూర్నగర్ లో నిర్వహిస్తున్న జాబ్ మేళా సూర్యాపేట జిల్లా నిరుద్యోగ యువతకే కాకుండా, ఉమ్మడి నల్గొండ జిల్లా నిరుద్యోగ యువతకు ఒక చక్కని అవకాశం అని, అందువల్ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి ,పౌరసరఫరాల శాఖ మంత్రి ఓఎస్ డి ప్రవీణ్ మాట్లాడారు. పలువురు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రతినిధులు మాట్లాడుతూ హుజూర్నగర్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు స్పందన బాగుందని, తమవంతుగా ఎక్కువమంది నిరుద్యోగ యువతను జాబ్ మేళాకు పంపించేలా సోషల్ మీడియా, ఎస్ఎంఎస్ ల, ద్వారా సమాచారాన్ని అందించడమే కాకుండా అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ, అడిషనల్ కలెక్టర్ కె. సీతారామా రావు, సింగరేణి ప్రతినిధులు శ్రీధర్, చందర్ డీట్ ప్రతినిధి వంశీ,ప్రజా ప్రతినిధులు సర్వోత్తమ్ రెడ్డి , చెవిటి వెంకన్న యాదవ్,కొప్పుల వేణారెడ్డి, పోతుల భాస్కర్, చింతల లక్ష్మి నారాయణ రెడ్డి,చకిలం రాజేశ్వర రావు, జి ఎం ఇండస్ట్రీస్ సీతారాం నాయక్, డిగ్రీ, ఇంజనీరింగ్ , పాలిటెక్నిక్ ,ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

# ఇందిరాపార్క్ ధర్నాను విజయవంతం చేయాలి

**నల్లగొండ,అక్టోబర్ 22,మన సాక్షి:**



బీసీ రిజర్వేషన్ల బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 24న ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలనీ బీసీ ఇంటలెక్చువల్స్ (బీసీఐఎఫ్) జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై, బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగం 9 వ షెడ్యూల్లో చేర్చాలనే డిమాండ్ తో "42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి" బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో అక్టోబరు 24 వ తేదీన (శుక్రవారం) ఉదయం 10 గంటల నుండి హైదరాబాదు ఇందిరాపార్క్ వద్ద జరిగే "మహాధర్నా"కు నల్లగొండ జిల్లా నుంచి బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోఆర్డినేటర్లు, బీసీ ఇ ఫ్ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నల్లగొండ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన బీసీఐఎఫ్ సమావేశంలో బీసీఐఎఫ్ ఆయన మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్లు కల్పించడంలో అన్ని పార్టీలలో చిత్తశుద్ధి లోపించిందని, కేవలం జీవోలతో రిజర్వేషన్లు సాధ్యం కాదని, రాజ్యాంగం 9 వ షెడ్యూలులో రిజర్వేషన్ల అంశాన్ని చేర్చితేనే చట్టబద్ధత ఉంటుందని అన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలోని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి తో కలిసి ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ ప్రకటించిందని,అనంతరం శుక్రవారం మహాధర్నా పోస్టరును ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్లు నకిరేకంటి కాశయ్య గౌడ్, దొమ్మాటి అంజయ్య ప్రజాపతి, చామల చంద్రశేఖర్, వైద్యుల యాదగిరి, రేగట్టే సైదులు, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు తలారి రాంబాబు, శ్రీనివాస్తదితరులూ పాల్గొన్నారు

# క్షయ వ్యాధి పై అందరికీ అవగాహన ఉండాలి

**అర్వపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



మధుమేహం ఉన్నవారికి క్షయ వ్యాధి తొందరగా లక్షణాలు చూపిస్తుందని అలాంటివారు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత పరీక్షలు నిర్వహించుకోవాలని మండల వైద్య అధికారి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మలలో క్షయ వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ సంవత్సరం చివరి నాటికి భారతదేశంలో క్షయ వ్యాధి లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. దగ్గు తగ్గకుండా నిరంతరం వస్తే వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలని అన్నారు, గ్రామంలోని ఆశా కార్యకర్తలకు తెలియజేస్తే పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి నోడల్ పర్సన్ కుంభం వీరయ్య గౌడ్ , ల్యాబ్ టెక్నీషియన్ చుక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఊర్మిళ, ఆశా కార్యకర్తలు రోజా కవిత పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**కేతేపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**

కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన పోలగాని బలరాం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీగా పని చేస్తూ రెండు రోజుల క్రితం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. మృతి చెందిన బలరాం నిరుపేద కుటుంబం కావడంతో స్పందించిన కేతేపల్లి పిఎసిఎస్ చైర్మన్, ఎన్డీసీఎంఎస్ చైర్మన్ అయిన బోళ్ల వెంకటరెడ్డి సంఘం ద్వారా బుధవారం 30 వేల రూపాయలు మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నకరికల్ మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, మాందాస్ పరుశురాములు, చింత వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ సుందర్ , బీరం జాన్ రెడ్డి మట్టి సల్మాన్, బీరం జాన్ రెడ్డి,, జటంగి వెంకట నర్సయ్య, అయితగోని వెంకట్, కోట పుల్లయ్య, కత్తుల వీరు, నకరికంటి మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వశక్తితో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలి

**అర్వపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



యువకులు చదువు పూర్తి కాగానే స్వశక్తితో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని, సూర్యాపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సాయిని మాధవ్ ఎగ్ సెంటర్ (ఎస్ ఎమ్) ను ప్రారంభించి మాట్లాడారు. మండల కేంద్రం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుందని, 25 నుండి 30 గ్రామ పంచాయతీల ప్రజలు ఇక్కడికి రోజు వస్తుపోతుంటారని అన్నారు. నాణ్యమైన వస్తువులు విక్రయిస్తూ నమ్మకంగా ఉంటే యువకులు ప్రారంభించిన ఏ వాణిజ్య సముదాయమైన లాభాల బాటలో నడుస్తుందని అన్నారు. వారు ఉపాధి పొందుతూనే మరో పదిమందికి అవకాశం ఇచ్చే విధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు సాయిని యాగానందం ముదిరాజ్, ఆకిటి నాగరాజు, ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు సాయిని మనోహర్ ముదిరాజ్, వేముల మధు, మామిడి ప్రదీప్, సాయిని శ్రీకాంత్, పెరసాని నరేష్, మామిడి రాజు, కనుక సాయి, సాయిని వీరస్వామి, ఆకిటి, వినయ్, సాయిని శేఖర్, బైరు రాంబాబు , సురేష్ , సాయిని రాము, కో మారి మహేష్ , పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కేతేపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి పత్యానాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని, శుభ్రపరచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ము కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసీఎంఎస్ చైర్మన్ బోల్ల వెంకట్రెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ అధికారి వంశీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ మందడి వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపట రంపచటి శ్రీనివాస్ యాదవ్, పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంగ్టి కాస్తూర్బా పాఠశాల తనిఖీ

**కంగ్టి, అక్టోబర్ 22, మన సాక్షి :**



సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కంగ్టి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో రహీమొద్దీన్ తో కలిసి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతి పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించి,రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట,అక్టోబర్ 22,మన సాక్షి:**

ప్రభుత్వ హాస్పిటల్ కు వచ్చే పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నూతనంగా నియామకమైన వైద్యాధికారులకు సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నియామకం అయిన వైద్యాధికారులు డాక్టర్ ఎస్ సాయి కృష్ణ,డాక్టర్ యన్ అమూల్య, డాక్టర్ బి ప్రణీత్ నాయక్,డాక్టర్ ప్రతిమలకు నియామక పత్రాలను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పి కే.నరసింహ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

# ఉచిత కృత్రిమ కాళ్లు పంపిణి కొరకు స్క్రీనింగ్ క్యాంప్

**శాలిగౌరారం,అక్టోబర్ 22,మన సాక్షి:**



లయన్ ఇంటర్నేషనల్, తెలంగాణ అమెరికా తెలుగు సంఘం స%శీ%యుక్త ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్ళ పంపిణి కోసం ఈ నెల 26న హయత్ నగర్ లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు తెలిపారు. అయన శాలిగౌరారంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ఉచిత కృత్రిమ కాళ్లు పొందే అవకాశం ఉంటుందని శ్రీనివాసులు తెలిపారు. పూర్తి వివరాలకు ప్రోగ్రాం డిస్టిక్ కో-ఆర్డినేటర్ లయన్ బచ్చుపల్లి రవీందర్ రావు 9848344767 గ్రేటర్ క్లబ్ అధ్యక్షులు లయన్ పూస లింగయ్య 9848299554. ప్రోగ్రాం జాయింట్ కో-ఆర్డినేటర్ లయన్ నూల పరమేష్ 9866549227 కు నెంబర్లకు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శ్రీనివాసులు కోరారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**పెన్ పహాడ్, అక్టోబర్ 22,మన సాక్షి :**




ఈ నెల 25న హుజుర్నగర్ లో జరిగే జాబ్ మేళాను వినియోగించు కోవాలని పెన్ పహాడ్ తహసీల్దార్ ధారావత్ లాలు నాయక్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ ంలో యువ నిరుద్యోగు లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజుర్నగర్ లో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ మరియు తెలంగాణా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సంజ్ సహకారంతో 250 ప్రైవేట్ సంస్థ ల తో 2000-5000 మందికి ఉద్యోగఅవకాశం కల్పిస్తున్నట్లు తెల్పినరు, పదవ తరగతి పాస్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ పీజీ ఫార్మసీ చదివిన వారు, 18-40 సంవత్సరాల వారు అర్హులు అని తెలిపినారు 25 అక్టోబర్ రోజున పెరల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ హుజుర్నగర్ లో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో , ఆర్ ఐ రంజిత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

**దామరచర్ల,అక్టోబర్ 22,మన సాక్షి:**




ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు వలన, పంట చేతికి వచ్చే సమయం లో పడుతున్న ఈ వర్షాల కారణంగా వరిపొలాలు మొత్తం పడిపోయి, రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయివున్నారని సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బోత్తల పాలెం గ్రామం లోనీ రైతులతో కలిసి సిపిఐ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అధికారులతో సర్వే చేయించి,నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి, పెట్టుబడులకు పైసలు లేక, వడ్డీలకు అప్పులు తెచ్చుకొని పెట్టుబడులు పెట్టి పంట పండించుకొని, ఇంకో 20 రోజులలో పంట చేతికి వస్తుందనే తరుణంలో అనుకోకుండా,ప్రకృతి కన్నెర్ర చేసి వర్షాలు పడటం వలన మండలంలోని అన్ని గ్రామాలలో చాలా వరకు పంటలు నేలకొరిగి క్రింద పడినాయని ఆయన అన్నారు. గాలికి వానకు పంట మొత్తం కింద పడటం వలన రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారని, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావనే బాధలో రైతులు ఉన్నారని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అధికారులతో సర్వే చేయించి నష్టపోయిన పంట వివరాలను సేకరించి,పంట నష్టపోయిన రైతులను ఆదుకొని, ప్రభుత్వం రైతులకు తామున్నామనే భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం పేరుపొంగ సైదులు మట్టయ్య లక్ష్మయ్య దర్శనం జేమ్స్ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ,అక్టోబర్ 22,మన సాక్షి:**



అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సరైన తేమ, నాణ్యత ప్రమాణాలు కలిగి ఉన్నట్లయితే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు.బుధవారం ఆమె ధాన్యం సేకరణ పై పౌర సరఫరాలు, సంబంధిత శాఖల అధికారులతో తన ఛాంబర్ లో సమీక్షించారు.

ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం ఉండడం వల్ల వర్షానికి తడిసిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల వచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి, తేమను చూసి సరైన ప్రమాణాలతో ఉంటే తక్షణమే కొనుగోలు చేసి అప్పటికప్పుడే మిల్లులకు పంపించాలని చెప్పారు.వర్షాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పూర్తి నాణ్యతతో కూడుకున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, తాలు,తరుగు , చెత్త, చెదారం లేకుండా, అలాగే సరైన తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చినట్లయితే తక్షణమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని, లేనట్లయితే వర్షం వల్ల ధాన్యం తడిసిపోతుందని, దానివల్ల రైతులకు ,నిర్వాహకులకు ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ధాన్యం సేకరణ నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,జిల్లా సహకార అధికారి పత్యా నాయక్,ఆర్టీవో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



**రామసముద్రం,అక్టోబర్ 22, మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం అరికల గ్రామ పంచాయతీ చిట్టెంవారిపల్లెలో గత వారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే.ఎస్సై రమేష్ బాబు బుధవారం ఘటనస్థలానికి చేరుకుని సంబంధిత వ్యక్తుల నుంచి సాక్షాలు, సంబంధిత వివరాలు సేకరించారు. ఎస్సై ఇరువురుతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్ బాబు హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే మమ్మల్ని సంప్రదించాలన్నారు.ఈ హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## సమస్య పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం



**రామసముద్రం,అక్టోబర్ 22,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా సమస్య మీది పరిష్కారం మాది అనే నినాదంతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాజంపేట టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. బుధవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది ప్రజలు తమ సమస్యలను ప్రజా దర్బార్లో చమర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సమస్యలపై అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కారం అయ్యేవి వెంటనే పరిష్కరించాలని,సమయం తీసుకునే సమస్యలను చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం ప్రజా దర్బార్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని ఆయన తెలియజేశారు.

## కిసాన్ కాపస్ యాప్‌పై పత్తి రైతులకు అవగాహన ఏవో అనిల్ కుమార్ నాయక్



**పెన్ పహాడ్ అక్టోబర్ 22,మన సాక్షి:**

మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో పత్తి పంట సాగు చేసిన రైతులకు కిసాన్ కాపస్ యాప్ పై మండల వ్యవసాయ అధికారి బి. అనిల్ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి పి.వికాస్ అవగన కల్పించినారు. ఈ కార్యక్రమంలో తమ్మనబోయిన మాధవరావు మరియు సింగారెడ్డిపాలేం పత్తి పంట సాగు చేసిన రైతులు పాల్గొన్నారు.సీసీఐలో పత్తి పంట కొనగోలు విధానం కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకోవాల్సిన విధానంపై రైతులకు సూచనలు చేసినారు రైతు మొదటగా కప్పాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకోవాలి,స్లాట్ బుక్ చేసుకున్న తేదీన మాత్రమే మీ యొక్క పత్తిని మార్కెట్ కి తీసుకెళ్లాలి,స్లాట్ బుక్ చేసుకోవాలి అంటే రైతు యొక్క ప్రస్తుత ఫోన్ నంబర్ పంట నమోదు లో రైతు యొక్క ఫోన్ నెంబర్ రెండు ఒకే నెంబర్ అయి ఉండాలి ,ఒకవేళ రైతు ప్రస్తుతం కొత్త నెంబర్ వాడుతున్నాట్లయితే ఆ యొక్క ఫోన్ నంబర్ ను మీ క్లస్టర్ యొక్క వ్యవసాయ విస్తరణ అధికారి ఏ ఈ ఓ వద్ద కొత్త నంబర్ ను అప్డేట్ చేయించుకోవాలి. పైన తెలిపిన సూచనల ప్రకారం రైతులు అనుసరించినట్లయితే పత్తి పంట అమ్ముకోవడం సులువు అవుతుందని మండల వ్యవసాయ అధికారి బానోతు అనిల్ కుమార్ తెలిపినారు.

## నిరుద్యోగులకు చక్కటి అవకాశం

**అర్వపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు చక్కటి అవకాశం వచ్చిందని, మండల తాసిల్దార్ శ్రీకాంత్ ఎంపీడీవో తిరునగరి గోపి, అన్నారు. బుధవారం మండల కేంద్రాల్లో మెగా జాబ్ మేళా పోస్టర్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 25వ తారీఖున హుజూర్ నగర్ కేంద్రంలో 150 బహుళ జాతి కంపెనీల లో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అన్నారు.దాదాపు 5,000 మంది పైచిలుకు ఉద్యోగస్తులుగా ఎంపికయ్యే అవకాశం ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఉచిత బస్సు సౌకర్యం భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. అన్ని గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద పూర్తి సమాచారం ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ రెవిన్యూ, పంచాయతీరాజ్, శాఖల ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామరాజు జలంధర్ రావు, వెంకటరెడ్డి, లక్ష్మీ ప్రసన్న,మల్లేశ్వరి,సరిత,రాములమ్మ, రెవెన్యూ కార్యదర్శిలు పాల్గొన్నారు

## అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమరం భీం

**మిర్యాలగూడ, అక్టోబర్ 22, మన సాక్షి:**



అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమరం భీం అని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, బిసి జేఏసీ కో కన్వీనర్ చేగొండి మురళీ యాదవ్ లు అన్నారు. కొమరం భీమ్ 124వ జయంతి సందర్భంగా మిర్యాలగూడలోని మెరెడ్డి రాంచంద్రరెడ్డి గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు.గిరిజన బిడ్డల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు కొమరం భీం అని చెప్పారు. నిజాం నవాబుల పాలనలో రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన నాయకుడు కొమరం భీమ్ అని చెప్పారు.జల్ జంగల్, జమీన్ నినాదం ఇచ్చి అడవి బిడ్డలకు ఐక్యం హక్కులను సాధించారని పేర్కొన్నారు.బానిస సంకెళ్లను తెంచడం కోసం ఉద్యమించి జీవితాన్ని త్యాగం చేసిన వీర తెలంగాణా యోధుడని కొనియాడారు.కార్యక్రమంలో కుమ్మరికుంట్ల సుధాకర్,రమేష్, మధు, బాలరాజు, పండు,సురేష్, సత్యనారాయణ,సీతారాం, సైద తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో తనిఖీ

**కేతేపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



కేతేపల్లి మండలం చీకటి గూడెం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నల్గొండ జిల్లా పరిషత్ సీఈవో బి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు, ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి త్వరితగతిన మిల్లులకు పంపించాలని, దిగుమతి అయిన ధాన్యం ట్రక్ సీట్లను ను వెంటనే తెచ్చుకొని బిల్లులు తయారుచేసి చేసి, త్వరితంగా రైతులకు ఎంఎస్పీ ధర చెల్లించాలని ఆయన నిర్వాహకులకు ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని తప్పనిసరిగా తాలుగింజలు లేకుండా శుభ్రం చేసి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని, ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి బి పురుషోత్తం, ఏఈఓ బాలరాజు, పిఎసిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర వర్షాలు..చెరువులు, కుంటలు సందర్శన

**రామసముద్రం,అక్టోబర్ 22,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామ పంచాయతీలో బుదవారం పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, విఆర్వో రమణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిరంతరంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులను, కుంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు తగు జాగ్రత్తలను తెలియజేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు తమ దృష్టికి తెలియజేయాలన్నారు.

## తుఫాన్ ప్రభావ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రామసముద్రం,అక్టోబర్ 22,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం లో సీఐ సత్యనారాయణ పోలీస్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు.మండలంలో రెండు రోజులుగా పడుతున్న వర్షాలగురించి ఎస్సై రమేష్ బాబు ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ తో ఎస్సై మండలంలో అక్కడక్కడ చెరువులు మరువలు పోతు న్నాయని చెప్పారు. సీఐ వెంటనే ఎస్సై పోలీస్ సిబ్బంది ని వెంట పెట్టుకొని ఎలావానెల్లూరు గ్రామపంచాయతీ కొత్తచెరువుకు బయలుదేరి మరువను పరిశీలించారు. అక్కడ కొందరు మరువలో ఉంటే వారిని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ ఈతుపాన్ కారణంగా విద్యుత్ ప్రమాదాలు మరియు ఆరోగ్య సమస్యలు సంభవించే అవకాశం ఉందని . ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ పోల్‌లు, వైర్లు, మోటార్లు, మీటర్లు తాకవద్దని దుస్తులు బయట ఆరేసేటప్పుడు, ఎలక్ట్రిక్ వైర్లకు దగ్గరగా ఆరేయవద్దన్నారు ,ముఖ్యంగా రైతులు పొలాల్లో పనిచేస్తున్నప్పుడు కరెంట్ వైర్లు నేలమీద పడి ఉన్నాయేమో చూసుకోవాలని వెంటనే కరెంట్ మోటార్ల స్టాటర్లు ముట్టుకోరాదన్నారు. నీటితో నిండిన ప్రదేశాల్లో విద్యుత్ లైన్లు ఉన్నాయేమో ముందుగా గమనించాలనిచిన్నపిల్లలను, వృద్ధులను విద్యుత్ వైర్ల దగ్గరికి రానివ్వవద్దని అనుమానాస్పదంగా ఎక్కడైనా వైరు కిందపడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు.

నీరు తాకిన స్విచ్‌లు లేదా మోటార్లను తక్షణం ఆన్ చేయరాదన్నారు.చెరువులు,వాగుల దగ్గరికి వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులతో జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నా సీఐ సత్యనారాయణ, ఎస్సై రమేష్ బాబు, కిరణ్ కుమార్, సురేంద్ర యాదవ్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో అరికల మానేవారిపల్లె గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపిడిఓ గపూర్ పర్యటించారు. తుపాన్ కారణంగా నిండిన చెరువులను పరిశీలించి పంచాయతీ సెక్రటరీలకు పలు సలహాలు సూచనలు ఇవ్వండజరిగింది.

## భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు

**సూర్యాపేట రూరల్, అక్టోబర్ 22, మన సాక్షి:**



సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శివాలయాల్లో బుధవారం కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేసి అందమైన పూలతో అలంకరించారు.ముందుగా మహిళలు దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. శివ దీక్షా స్వాములు దేవాలయంలో స్వామి వారిని కీర్తిస్తూ భజనలు చేశారు.

## రుచికరమైన మధ్యాహ్న భోజనం

**అర్వపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యంగా రుచికరంగ ఉంటున్నాయని మండల విద్యాశాఖ అధికారి బాలు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కలిసి భోజనం చేసిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్నం పాఠశాలలో వండిన ఆహారం తీసుకుంటున్నారని అన్నారు. తాజా కూరగాయలతో మేను ప్రకారం కూరగాయలు, కోడిగుడ్డు, చారు, పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఎంఈఓతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఫిజికల్ డైరెక్టర్ పి మల్లేష్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిల్లలకు చదువుతోపాటు ఆటలు, ఆహారం కూడా నాణ్యమైనది అందిస్తామని అన్నారు.

## టమోటా మండి యజమానులతో సమావేశం

**రామసముద్రం,అక్టోబర్ 22,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధ వారం మదనపల్లి టమోటా మార్కెట్ చైర్మన్ జంగాల శివరాం రాయల్ ఆధ్వర్యంలో టమోటా మండి యజమానులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే షాజహాన్ భాష పాల్గొన్నారు. సందర్భంగా జంగాల శివరాం రాయల్ మాట్లాడుతూ అందరూ కలిసి రైతు సంక్షేమానికి కృషి చేయాలని, జాక్ పాట్, కమిషన్ విధానంపై మండి యజమానులు పునరాలోచన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మండి, యజమానులు, పాల్గొన్నారు.

## ఆర్టిఏ చెక్ పోస్ట్ మూసివేత

**దామరచర్ల,అక్టోబర్ 22,మన సాక్షి:**




దామరచర్ల మండల కేంద్రంలోని వాడపల్లి ప్రాంతంలో ఉన్నటువంటి ఆర్టిఏ చెక్ పోస్ట్ ను అక్టోబర్ 22 బుధవారం నుంచి మూసివేస్తున్నట్లు ఆర్టిఏ అధికారులు తెలిపారు. పౌరులు ఆర్టిఏ సేవలను వెబ్సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు అంతర్ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద లభించిన సేవలు టెంపరరీ పర్మిట్ వాలంటరీ టాక్స్ స్పెషల్ పర్మిట్ లాంటి సేవలను ఇకమీదట ఆన్లైన్లో పొందవచ్చని తెలిపారు.

# కార్తీక మాసం ప్రారంభం..ఆకాశదీప దివ్యదర్శనం

**గుర్రంపోడు, అక్టోబర్ 22,మన సాక్షి:**

గుర్రంపోడు మండలం చామలేడు శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో, కొప్పోలు బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆకాశ దీపం దివ్యదర్శనం,ఆకాశ దీపం దర్శనం అనేది కార్తీక మాసంలో ఒక ప్రత్యేక పూజ.కార్తీక మాసంలో సాయంకాల పూజల తర్వాత, ఆలయ గోపురం పైన లేదా ప్రాంగణంలో ఉన్న స్తంభానికి ఒక భారీ దీపాన్ని వెలిగిస్తారు. దీనినే ఆకాశ దీపం అని పిలుస్తారు. ఈ దీపం సాక్షాత్తు పరమశివుడిని ఆకాశం నుండి దర్శించుకోవడానికి సంకేతంగా భావిస్తారు.సాయంకాల అర్చన మరియు ఆకాశ దీపం సమయంలో, భక్తులు స్వామివారిని దర్శించుకుని, ఆ ఆధ్యాత్మిక వాతావరణంలో పరవశిస్తారు. ఇది భక్తులకు ఒక దివ్యమైన అనుభూతిని ఇస్తుంది. కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభమైంది. ఆధ్యాత్మికంగా దివ్యమైనది కార్తీక మాసం. ఈ కార్తీక మాసంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమాలు చేస్తారు. మాసాలన్నిటిలో ఉత్తమైన మాసంగా కార్తీక మాసాన్ని చూస్తారు. ఈ మాసంలో శివ కేశవులను భక్తులు పూజిస్తారు. సూర్యోదయానికి ముందే బ్రహ్మ ముహూర్తంలో అభ్యంగన స్నానం చేస్తారు. కార్తీక మాసంలో దీపం వెలిగిస్తే ఎంతో శుభకరమని భక్తులు నమ్ముతారు. గుర్రంపోడు మండల గ్రామలలో ఈ మాసంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇక భక్తులు తెల్లవారుజామునే నదుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు



# అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదానం

**సూర్యాపేట,అక్టోబర్ 22,మన సాక్షి:**



అన్నదానం మహాదానమని అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు బెలిదె శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శబరి నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో మాలాధారణ స్వాములకు 61 రోజుల పాటు నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేవాలయంలో జరిగే అన్నప్రసాద వితరణను మాలాధారణ స్వాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇట్టి అన్నదానం కార్యక్రమం నకు దాతలు విరాలాలు అందజేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నదాత మనసాని నాగేశ్వర్ రావు-శ్రీదేవి దంపతులు, మణికంఠ సమత దంపతుల కమిటీ సభ్యులు ఆకాష్, మనసాని రామ్మూర్తి, చంద్రశేఖర్, బచ్చు శ్రీను, జటంగి రవి, గొట్టిముక్కుల శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వాములు జేపీటీ మారం సాయి వెంకటేశ్వర్ రావు,, వంకాయలపాటి శంకర్ , సంపత్ వెంకట్ రెడ్డి, సుధాకర్ అర్చకులు సతీష్ శర్మ, కోటి తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



**నడిగూడె, అక్టోబర్ 22,మన సాక్షి:**

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రధాన ధ్యేయంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఈ నెల 25 హుజూర్ నగర్ లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లు ప్రత్యేక చొరవతో 150 కంపెనీల సౌజన్యంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నందున నిరుద్యోగులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్సూర్ నాయక్,ఎస్ఐ జి. అజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎలక ఉమారాణి, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దైవచింతనతో మానసిక ప్రశాంతత



**చింతపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**

ప్రతి ఒక్కరూ శ్రీ అభయాంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం చింతపల్లి మండల పరిధిలోని దేన్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల గాసిరాం తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి 6వ వార్షికోత్సవం కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ పాల్గొని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.....దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమావత్ కొండల్, మత్య నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ హరి నాయక్, జబ్బర్, సుందర్, గౌరాజ్, తరుణ్,పుల్ సింగ్,వినోద్, తదితరులు ఉన్నారు.

# నాగరాజు మృతి బాధకరం

**చింతపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



పీఏపల్లి మండల కేంద్రానికి చెందిన పాత్రికేయ మిత్రుడు బుయ్య శివ నాగరాజు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని చింతపల్లి మండల ప్రెస్ క్లబ్ రిపోర్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల వెంకటేశ్వర్లుపేర్కొన్నారు. వారు అందించినటువంటి సేవలను కొనియాడుతూ వారు గతంలో ప్రైవేటు స్కూలు టీచర్గా పని చేస్తూ సమాజంలో తన వంతుగా ఎంతో కొంత ప్రజలలో చైతన్యం తీసుకురావాలని తపనతో 1999లో ప్రజాతంత్ర రిపోర్టర్ గా వృత్తిలోకి రావడం జరిగింది. ప్రజలను చైతన్యం చేయడానికి తను చేసినటువంటి కృషి నుంచి సాగినటువంటి విలేకరి ప్రస్థానం తదుపరిగా ఆంధ్రభూమి మరియు ఇంకా ఎన్నో వివిధ రకాల పత్రికలలో పనిచేస్తూ సమాజంలోని యువతను ప్రజలను చైతన్యవంతులను చేస్తూ తన వంతు పాత్రను నిర్వహించడం చెప్పుకోదగ్గ విషయం అన్నారు.ఇలా జరగడం చాలా బాధాకరం దేవుడు రాసిన రాత అది ఎవరికి అతీతం కాలేదు కానీ ఆయన చేసినటువంటి మంచి పనులను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు చింతపల్లి మండలం ప్రెస్ రిపోర్టర్ అసోసియేషన్ తరపున చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల వెంకటేశ్వర్లు, వనమాల వెంకటేష్, మొగతాల శేఖర్, పసునూరి వెంకటేష్, జిల్లా నరసింహ గౌడ్, కేశగొని పరమేష్ గౌడ్, వైద్యుల ప్రవీణ్ శర్మ, కేశగో ణి వెంకటేష్ గౌడ్ లు మనస్ఫూర్తిగా మా ప్రగాఢ సానుభూతి అశ్రు నివాళులు తెలియజేస్తున్నాము .

# వృద్ధాశ్రమంలో అన్నదానం

**సూర్యాపేట,అక్టోబర్ 22,మన సాక్షి:**




సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి వివేకానంద వృద్ధాశ్రమంలో సన్‌రైస్ యూత్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాన్ని వడ్డించి, వారితో మమేకమై వారి ఆరోగ్యం, అవసరాలు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సన్‌రైస్ యూత్ సంస్థ అధ్యక్షుడు వల్దాస్ రాజీవ్ మాట్లాడుతూ “సేవే మన ధర్మం. వృద్ధులు మనకు మార్గదర్శకులు, వారి కష్టాలను అర్థం చేసుకోవడం ప్రతి యువకుడి బాధ్యత అన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించడమే మా సంస్థ లక్ష్యం” అని పేర్కొన్నారు.వృద్ధాశ్రమ నిర్వాహకులు సన్‌రైస్ యూత్ సభ్యుల సేవా కార్యక్రమాన్ని ప్రశంసించి, యువత ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏడుకొండలు వెంకటేష్, నవీన్, సాయి, శ్రీధర్, రాహుల్, బంటి, దిలీప్, ప్రదీప్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**కంగ్టి, అక్టోబర్ 22, మన సాక్షి :**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చెస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఓ సత్తయ్య ఆదేశించారు. బుధవారం కంగ్టి మండల రాజారాం తండాలో ఎంపిడిఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తండా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను దశల వారీగా పూర్తి చేసిన వెంటనే ఫోటోలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు , లబ్ధిదారులు ఉన్నారు.

**ప్రాథమిక విద్యాభ్యాసం మెరుగుపరచాలి:**

కంగ్టి మండల రాజారాం తండాలో ప్రాథమిక పాఠశాల ఎంపిడివో సత్తయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థుల తరగతిని పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 62 మంది విద్యార్థులకు 56 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం ఆయన విద్యా ప్రమాణాలు ప్రతిష్టం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి బోనస్ పొందాలి

**నడిగూడెం,అక్టోబర్ 22,మన సాక్షి:**



రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని,కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరతో పాటు కింటాకు రూ 500ల బోనస్ పొందాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ రైతులను కోరారు. బుధవారం నడిగూడెం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే రైతులకు మేలు జరుగుతుందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో లక్షల కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కంభంపాటి సరిత,ఎంపీఓ విజయకుమారి,ఏపిఎం దుర్గాప్రసాద్, సి సి శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి పృధ్వి,ఐకెపి నిర్వాకరాలు మంజుల,మాజీ సర్పంచి వీరారెడ్డి,గోపిక్రిష్ణ రెడ్డి యలక వెంకటరెడ్డి,సుధీర్ రెడ్డి బొల్ల నరసింహ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉపేందర్ రెడ్డి వెంకన్న నాగరాజు పొదుపు సంగం కోఆర్డినేటర్ మంజుల సంఘ బంధ అధ్యక్షురాలు భవాని రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సీపీవోలో మెగా రక్తదాన శిబిరం

## 653 యూనిట్ల రక్తం సేకరణ

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా, రంగారెడ్డి జిల్లా సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ తో కలిసి బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మెడికోవర్ హాస్పిటల్స్. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో “రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి” అనే నినాదంతో జరిగింది ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. మేడ్చల్ డీసీపీ ఎన్‌ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, ఐపీఎస్ తదితరులు రక్తదానం చేశారు.

# ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు

**శాలిగౌరారం,అక్టోబర్ 22,మన సాక్షి:**



రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిల పైనతెలంగాణ భవన్ లో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ బుధవారం చేసినటువంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు శాలిగౌరారం మండల ఎస్ సీ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.శాలిగౌరారంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల వారు మాట్లాడారు.తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర వ్యాపారస్తుల వద్ద డబ్బులు వసూలు చేసి కెసిఆర్ కాళ్లు మొక్కి ఎమ్మెల్యే అయిన విషయం గుర్తుకు లేదా కిషోర్ కుమార్,నీవు దొంగ నోట్ల వ్యాపారం చేసి, నయూ%శీ% తో కలువ లేదా అని విమర్శించారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత ధనంజయ ,కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు బోడ అరుణ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరమాండ్ల నరేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూరి పరుశరాములు , నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వేముల భరత్,కోక సాయి, గుండ్లపల్లి సైదులు,ఇంద్రకంటి యాదయ్య ,బట్ట లక్ష్మణ్, సుల్తాన్ వెంకన్న ,జినుక మధు,బందెల ఉదయ్ , ఏసు దాసు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక పోరాటం

**దేవరకొండ,అక్టోబర్ 22,మన సాక్షి:**




యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల (డ్రగ్స్) దుష్ప్రభావాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు చొరవ చూపారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్. (నేషనల్ సర్వీస్ స్కీమ్) యూనిట్ 1, 3 సంయుక్త ఆధ్వర్యంలో తాటికొల్ నందనామిట్ట గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా 6వ రోజు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.మాదక ద్రవ్యాలు వద్దు – జీవితం ముఖ్యం డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం వంటి నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాలంటీర్లు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నడిచారు. ర్యాలీ ద్వారా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు కుటుంబాలలో ఏర్పడే అల్లకల్లోలం సామాజిక విధ్వంసం గురించి ప్రజలకు వివరించారు. ఈ ర్యాలీ 7 రోజుల శిబిరంలో 6వ రోజు కీలక కార్యక్రమంగా జరిగింది.ఈ అవగాహన ర్యాలీలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ వి. నర్సింహ, జయప్రకాశ్ నారాయణ, హైస్కూల్ పీడీ సైదులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లతో పాటు, గ్రామ యువత, పెద్దలు కూడా ఈ సామాజిక కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. యువత భవిష్యత్తు కోసం విద్యార్థులు చేస్తున్న ఈ కృషిని గ్రామస్తులు అభినందించారు.

# బీర్కూర్ నుండి శబరిమలకు మహా పాదయాత్ర

**బీర్కూర్,అక్టోబర్22,మన సాక్షి:**



భీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భీర్కూర్ నుండి సుమారుగా 1400 కేమీ దూరంలో గల అయ్యప్ప స్వామి దర్శనం కోసం కేరళలో గల శబరిమలకి మహాపాదయాత్ర గా వెళ తున్నా అయ్యప్ప మాలధారణ స్వాముల కు ఇమ్యూనిటి కొరకు మరియు నొప్పుల కొరకు మరియు హెల్త్ జాగ్రత్తగా ఉండాలని మెడికల్ కిట్లు వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమాల్లో అయ్యప్ప స్వాముల గురుస్వామి సుధాకర్ యాదవ్ గురుస్వామితో పాటు లయన్స్ అధ్యక్షులు సితలె రమేష్ , ట్రిజరర్ మేకల గాలయ్య ,జోన్ చైర్మన్ కొట్టురి సంతోష్ సెట్ , సీనియర్ లయన్స్ సేవాకులు మేకల విఠల్ , వీరయ్య సెట్ అయ్యప్ప స్వాములు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ఆయుధాల పై విద్యార్థులకు అవగాహన

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 22, మన సాక్షి :**



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నారాయణపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించి పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయుధాలు ఎలా పనిచేస్తాయి వాడే విధానం గురించి పోలీసులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సిఐ శివశంకర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ పోలీస్ శాఖపై ప్రజలకు అందిస్తున్న సేవలపై పోలీస్ శాఖ పనితీరు, విద్యార్థులకు పోలీస్ విధులు వైర్లెస్ సెట్ పనితీరు ఎఫ్ఐఆర్ చార్జి షీట్, డయల్ 100, సీసీ కెమెరాలు పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఎలా చేస్తారు, పాత నేరస్తులను గుర్తుపట్టడానికి ఫింగర్ ప్రింట్ ద్వారా గుర్తించడం లాంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐ మద్దయ్య, ఎస్సై 2 గాయత్రి, పోలీస్ సిబ్బంది విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నారాయణపేట టౌన్, అక్టోబర్ 22, మన సాక్షి :**



తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల కోసం పని చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి తెలిపారు. బుధవారం నారాయణపేట ఆర్డీవో కార్యాలయంలో నారాయణపేట మండలం, పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని 95 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నదని తెలిపారు. ప్రతి నిరుపేదకు సొంత ఇంటి కల సాకారం చేసేలా నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వాలు ఇవ్వని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు తమ ప్రభుత్వంలో మంజూరు అయ్యాయని చెప్పారు.

అభివృద్ధి అనేది నిరంతరం జరుగుతుందని ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ రైతు భరోసా అందజేస్తూ రైతన్నలను ఆదుకున్నామన్నారు. మక్తల్ నారాయణపేట్ ఎత్తిపోతల పథకంతో ఈ ప్రాంతం సశ్యామలం అవుతుందని ఆమె ఆశా భావం వ్యక్తం చేశారు. వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్ మంజూరు చేసినందున ముఖ్యమంత్రి కి ధన్యవాదములు తెలిపారు. నియోజకవర్గంలో 150 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టి అన్ని ప్రాంతాలలో పిడబ్ల్యూడి,ఆర్ అండ్ బి రోడ్లు వేస్తామని తెలిపారు.

నారాయణపేట మున్సిపాలిటీకి 15 కోట్లు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, జిల్లా గ్రంథాల సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, ముఖ్య నాయకులు, పట్టణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్ లపై అక్రమ దుకాణాల తొలగింపు



**శంకర్‌పల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ముందు, రైల్వే స్టేషన్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న పండ్ల, పూల, టీ స్టాల్ అక్రమ దుకాణాలను బుధవారం మున్సిపల్, ట్రాఫిక్ పోలీసు అధికారులు కలిసి జెసిబి సహాయంతో తొలగించారు. ఫుట్ పాతులపై అక్రమంగా దుకాణాలను నిర్మిస్తే కఠిన చర్యలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలకు వాహనదారులు, వ్యాపారస్తులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. రోడ్లపై ఉన్న రేకుల షెడ్లను, టీ స్టాల్, తోపుడు బండ్లను మున్సిపల్ వాహనాలలో ఎక్కించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, సిఐలు శ్రీనివాస్ గౌడ్, సతీష్, ఎస్సైలు దేవేందర్, మంజుల, శ్రీశైలం మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

# కానిస్టేబుల్ గణేష్‌కు ఘన నివాళి



**ఆర్మూర్,అక్టోబర్ 22,మన సాక్షి:**

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం కానిస్టేబుల్ గణేష్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గణేష్ గతంలో మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో విధి నిర్వహణలో వీరమరణం పొందారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ సత్యనారాయణ గౌడ్ గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తరువాత ఒక నిమిషం నిశ్శబ్దాన్ని పాటించి అమరవీరుని స్మరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, గణేష్ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన..
# ఆలేరు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**శంకర్‌పల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**

శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో నూతనంగా మల్లన్న, బీరప్ప, కొండ పోచమ్మ ఆలయాలను నిర్మించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని బుధవారం మండల కురుమ సంఘం అధ్యక్షులు బండమీది వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. తప్పకుండా ఆలయ ప్రతిష్టకు హాజరవుతానని ఎమ్మెల్యే చెప్పినట్టు సంఘం సభ్యులు పేర్కొన్నారు.

# బ్యాంకుల్లో భద్రత పై తనిఖీ

**గోదావరిఖని,అక్టోబర్ 22,మన సాక్షి:**



ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యల్లో భాగంగా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ పక్కన ఎస్బిఐ బ్యాంక్, న్యూ అశోక్ థియేటర్ పక్కన యూనియన్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న హెచ్డిఎఫ్ బ్యాంక్ లలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తనిఖీలు నిర్వహించారు.అదేవిదంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని మిగతా బ్యాంకుల్లో భద్రతపై ఎస్ ఐ రమేష్ కూడా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో, ఏటీఎంల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సీసీ టీవీ కెమెరాలు బ్యాంకులు భద్రత ప్రయోజనాల కోసం కలిగి ఉండాలని సూచించారు. తదనుగుణంగా బ్యాంకు భద్రతాంశాలపై బ్యాంకు ఆవరణ అంతా కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, సెక్యూరిటీ గార్డ్ ఏర్పాటు, బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. బ్యాంక్ కు వచ్చే కస్టమర్ లకు ఎవరైనా ఎక్కువ సమయం బ్యాంక్ లో ఉన్నట్టు అనుమానస్పదంగా అనిపిస్తే సమాచారం చెప్పాలని, బ్యాంకు నుండి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా కస్టమర్లకు అవగాహన కల్పించాలని బ్యాంక్ అధికారులకు సిఐ సూచించారు.

# పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పరామర్శ

**నిజామాబాద్,అక్టోబర్ 22,మన సాక్షి:**



తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమరులైన పోలీస్ కుటుంబాలను కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ పరామర్శించారు.కమిషనర్ అమరుల కుటుంబ సభ్యులను కలిసి వారి బాగోగులు తెలుసుకున్నారు. అమరుల ఫోటోలకు పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. కుటుంబాలు ప్రభుత్వం నుంచి పొందిన సహాయ సహకారాలపై వివరాలు తీసుకున్నారు. ఇంకా అవసరమైన సహాయం లేదా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అమరుల కుటుంబాలు ఎల్లప్పుడూ పోలీస్ శాఖకు భాగస్వాములేనని, వారికి నిరంతర సహాయ సహకారాలు అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యుల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీ రాజ వెంకటరెడ్డి, ఎన్ఐబి ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఆరిఫ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖని పోలీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**గోదావరిఖని అక్టోబర్ 22,మన సాక్షి:**



అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి , రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ గోదావరిఖని ఎం. రమేష్ తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు వారోత్సవాల సందర్భంగా ప్రజల గురించి పోలీసు ఏ విధంగా పనిచేస్తుంది ఏ విధంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తు కలిసి పనిచేస్తున్నారు అనేది ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రాణాలు అరిప్పించిన వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు తమ విధి నిర్వహణలో ప్రజల రక్షణతో పాటు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా, పండగల సమయంలోనైనా ఎల్లవేళలా 24 గంటలు ప్రజల ధన మాన ప్రాణ రక్షణకై పోలీసులు విధులను నిర్వర్తిస్తారని దానితో పాటు ప్రజలకు అత్యవసర సమయంలో, ప్రమాద ఆపద సమయంలో ప్రాణాల రక్షణ కొరకు, తల సేమియా వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తం కోసం ఇలాంటి కార్యక్రమంలను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అన్నారు.ఈ రక్తదాన శిబిరం లో పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏసిపి రమేష్, సిఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్,ఎస్ఐ రమేష్, రామగుండం ఎస్ ఐ సంధ్యారాణి, పోలీస్ స్టేషన్ సిబ్బంది తో పాటు నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు.సేకరించిన రక్తాన్ని మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా తల సేమియా వ్యాధిగ్రస్తులకు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్సైలు రమేష్, అనూష, రామగుండం ఎస్సై సంధ్యారాణి అంతర్గం ఎస్ఐ వెంకట్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్లప్ప, జోన్ చైర్మన్ మల్లికార్జున్, రిజియాన్ చైర్మన్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే నారాయణ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు




**ఆమనగల్లు,అక్టోబర్ 22,మన సాక్షి:**

కాంగ్రెస్ శ్రేణులు బుధవారము హైదరాబాదులోని స్థానిక ఎంఎల్ఎ కసి రెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ లు కలిసి ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలుపుతు శాలువాతో సత్కరించారు. జాతీయ రహదారి రోడ్డు విస్తరించక పోవడం వల్ల వాహనాల రద్దీ పెరిగి వాహన దారులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలుపుత గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే శ్రీశైలం జాతీయ రహదారి రోడ్డును మూడు లైన్లుగా విస్తరించడం జరిగిందని ప్రస్తుతం వాహనాల రద్దీ 10 రెట్లు పెరిగాయని అందుకు అను గుణంగా జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని స్థానిక ఎంఎల్ఎ కసిరెడ్డి నారాయణ రెడ్డి కి కోరారు.ఈ విషయం పై స్థానిక ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించి నా పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

# అలుపెరుగని పోరాటం యోధుడు కొమరం భీమ్

**నాచారం,అక్టోబర్ 22,మన సాక్షి:**



అడవి బిడ్డల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొమరం భీమ్ 124వ జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ కొమరం భీమ్ ఆదిలాబాద్ జిల్లాలో జన్మించాడని నిజాం పాలనలో రజాకారులు ఆదివాసీలపై అనేక పన్నులు వేసి వారి జీవితాలను నరక కూపంగా మార్చారని పశువులపై పన్నులు అడవి ప్రవేశ నిషిద్ధం ఈ నేపథ్యంలో జల్,జంగల్, జమీన్ అనే నినాదంతో అడవి బిడ్డలకు అండగా ఆదివాసీలందరిని ఐక్యం చేసి వారిలో ధైర్యం నింపారని అన్నారు. చిన్నతనం నుంచే తను నమ్మిన సిద్ధాంతం కోసం బానిసత్వపు సంకెళ్లు తెంచడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ఆదివాసీలందరికీ దేవుడయ్యాడని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ అంస అధ్యక్షుడు నామ సైదులు, ఎంఎస్ఎఫ్ నాయకులు ఎర్ర స్వామి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు వీరబోయిన లింగయ్య యాదవ్, గోదా రవీందర్, విజయ్ నాయక్, కు అంబేద్కర్, అర్జున్, పల్స ఆంజనేయులు, క్యాదాస్ రవి తదితరులు పాల్గొన్నారు

# భూ భారతి చట్టం పై జీపివోలకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల,అక్టోబర్ 22,మన సాక్షి:**



జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జీపివోలకు భూ భారతి చట్టంపై శిక్షణ అవగాహన విధి నిర్వహణ బాధ్యతల గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రెవిన్యూ క్లస్టర్ కు ఒక గ్రామ పాలనాధికారి ( జీపివో ) ఉంటారని తెలిపారు.గ్రామ పాలనాధికారులు రికార్డుల నిర్వహణ, భూమి హక్కుల రికార్డు (ఆర్.ఓ.ఆర్), వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మరియు మ్యూటేషన్, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ రకాల రెవెన్యూ సర్వీసుల గురించి నూతన జీపివోలకు శిక్షణ మరియు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు.భూ భారతి చట్టంలోని ముఖ్యమైన సెక్షన్ల గురించి జీపివోలకు వివరించారు. అదేవిధంగా జీపివోలు గ్రామ పటం, ప్రాథమిక సమాచారం, నీరు, ఇసుక, ఇతర మైనింగ్ కార్యకలాపాలపై నియంత్రణతో పాటు, కులం, నివాసం,ఆదాయం, లోకల్ ఏరియా ఇతర ధృవీకరణ పత్రాల మంజూరు కొరకు విచారణ నివేదిక లో క్రియాశీలంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.విలేజ్ మ్యాప్ ఖచ్చితంగా విధి నిర్వహణలో వెంట ఉండాలని, సెత్వార్, ఖాస్రా వంటి రికార్డులపై ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాలు, అసాధారణ సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉండాలని,ప్రాథమిక సమాచారం మండల తహసీల్దార్, మరియు ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు. గ్రామాల్లోని ఇసుక, మట్టి అక్రమ రవణాలను నిలువరించాల్సిన బాధ్యత జీపివోలదే అని తెలిపారు. చట్టాలను ఉపయోగించే సందర్భంలో రూల్స్ పాటించాలని, సమస్యలను పరిష్కరించే విషయం లో ఏవైనా సందేహాలుంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.వో హకీమ్, సంబంధిత అధికారులు, జీపివోలు, తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు
## రైతులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన

**కరీంనగర్ అక్టోబర్ 22, మన సాక్షి:**



దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కపంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం బెజ్జంకి మండలంలోని తోటపల్లి, ముత్తన్నపేట, కల్లేపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. తేమ, తరుగు పేరుతో కోతలు ఉండవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తేమ, తరుగు పేలిట భారీగా కోతలు విధించి రైతులకు నష్టం చేకూర్చారన్నారు. అలాంటి పరిస్థితి కాంగ్రెస్ పాలనలో లేదన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన నిర్ణీత గడువులోగా రైతు ఖాతాల్లో చెల్లింపులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. వరి ధాన్యానికి మద్దతు ధర పెంచడమే కాకుండా సన్న వడ్లు పండించే రైతులకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం

**ఉగ్రవాదంపై జైషే ఆన్‌లైన్ కోర్సులకు ప్లాన్ పలు జాతీయ మీడియాల్లో కథనాలు**




ఇస్లామాబాద్: మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రముఠాను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసినట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చె÷-లలెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సులో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి. ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించు కున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చె÷-లలెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# ఆరువేలు తగ్గిన బంగారం ధరం

**అంతర్జాతీయ పరిణామాలతో తగ్గుదల**



హైదరాబాద్: రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న బంగారం బుధవారం భారీ తగ్గుదలను నమోదు చేసింది. ఒక్క రోజులోనే ఆరు వేల రూపాయలు తగ్గింది. హైదరాబాద్‌లో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెటర్ల పది గ్రాముల బంగారం ధర బుధవారం ఉదయం రూ.1, 27, 200కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 16, 600కి చేరింది.

అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర తగ్గడం వల్లే బంగారం ధరల తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ల బంగారం ధరం ఏకంగా 245 డాలర్లు క్షీణించింది. 4097 డాలర్లకు దిగి వచ్చింది. మరోవైపు వెండి కూడా ఔన్స్ ధర 3.9 డాలర్లు తగ్గి 48.39 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వెండి ధరలు కిలోకు దాదాపు రూ.2 వేలు తగ్గి రూ.1.80 లక్షలకు చేరుకున్నాయి. 2013 తర్వాత ఈ రెండు లోహాలు ఒక్క రోజులో ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఈ రెండు లోహాలు గరిష్టాలకు చేరువ కావడం, అంతర్జాతీయంగా డాలర్ తిరిగి బలోపేతం కావడం, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లబడడం అంతర్జాతీయ విపణిలో బంగారం ధర పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. మంగళవారంతో పోలిస్తే 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.6 వేలు తగ్గింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు విజయవాడలో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,200కు చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,600కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,62,000కు చేరుకుంది.

# అంతుచిక్కని ప్యారిస్ మ్యూజియం చోరీ

**రూ.895 కోట్లు విలువైప పురాతన వస్తువులు మాయం**

ప్యారిస్: ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత లౌవ్రే మ్యూజియంలో చోరీ ఘటన యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. అత్యంత భద్రత కలిగిన ఈ మ్యూజియంలోకి చొరబడిన దుండగులు కేవలం నిమిషాల వ్యవధిలో విలువైన ఆభరణాలు దొంగలించి పరారయ్యారు. చోరీ అయిన నగల విలువ దాదాపు రూ.895 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్టోబరు 19న పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో చోరీ జరిగింది. మ్యూజియంలో ఓ వైపు నిర్మాణం జరుగుతుండగా.. అక్కడి నుంచి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం సరుకు రవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ కాలంనాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించారు. వీరు వెళ్తుండగా.. అందులోని ఓ ఆభరణం మ్యూజియం బయట పడిపోయింది. మిగతా ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ దొంగతనం చేసింది ఎవరనేది ఇంతవరకూ తేలలేదు. అయితే కరుడు గట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ పని అయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చోరీకి పాల్పడింది పింక్ పాంథర్స్ గ్యాంగ్ అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాల్లేనప్పటికీ చోరీ జరిగిన తీరు ఆ ముఠాను గుర్తుకుతెస్తోంది. వీరు గప్‌చుప్‌గా వస్తారు. ఎలాంటి తొట్రుపాటు లేకుండా పని ముగించుకొని వెళ్లిపోతారు. మ్యూజియంలో చోరీకి పాల్పడిన వారు దొంగతనాల్లో ప్రొఫెషనల్స్‌గా కన్పించారు. ఇంతవరకూ వారి ఆచూకీ దొరకలేదు. పక్కా సమాచారం, ప్రణాళికతో దొంగతనానికి పాల్పడటం చూస్తుంటే పింక్ పాంథర్స్ పనే అనిపిస్తోంది అని ఫ్రాన్స్ స్క్వాడ్ బ్యూ'ది స్వీనీ' మాజీ చీఫ్ బ్యారీ ఫిలిప్స్ అభిప్రాయపడ్డారు. ఈ దొంగల ముఠా గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారీ చోరీలకు పాల్పడింది. అందరూ చూస్తుండగానే దొంగతనాలు చేయడం వీరి నైజం. కేవలం ఆభరణాలు, వజ్రాలనే దోచుకుంటారు. ఇప్పటివరకు 35 దేశాల్లో దాదాపు 500 మిలియన్ డాలర్ల ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగిలించినట్లు ఆధారాలున్నాయి. వీరి ముఠాలో ఎక్కువ మంది తూర్పు ఐరోపా దేశస్థులే ఉంటారు. కొన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను రిక్రూట్ చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. 1990ల్లో జరిగిన బోస్నియా యుద్ధంలో పాల్గొన్న సెర్బియన్ స్పెషల్ ఫోర్సెస్ సభ్యులు కూడా ఈ ముఠాలో ఉన్నట్లు గతంలో ఇంటర్‌పోల్ గుర్తించింది. మాజీ సైనికులు కావడంతో మిలిటరీ తరహా క్రమశిక్షణతో ఎ÷-లానింగ్ చేయడం ఈ గ్యాంగ్ అలవాటు. టార్గెట్ చేసే ప్రాంతంపై ముందుగానే నిఘా ఉంచుతారు. ఆ తర్వాత పథక రచన చేస్తారు. ఒకసారి చోరీ పూర్తయిన తర్వాత వెంటనే నకిలీ పాస్‌పోర్టులతో దేశం దాటేస్తారు. వీరికి అంతర్జాతీయంగా నెట్‌వర్క్ ఉంది. దొంగతనం చేసిన ఆభరణాలు, వజ్రాలను కరిగించడం లేదా వాటి ఆకృతి మార్చి మార్కెట్లో విక్రయిస్తుంటారని గత దర్యాప్తుల్లో తేలింది. ఓసారి ఈ పింక్ పాంథర్స్ గ్యాంగ్ దుబాయ్‌లోని ఓ మాల్‌లో చోరీకి పాల్పడింది. ఆ మాల్‌లోని నగల దుకాణంలోకి కార్లతో దూసుకెళ్లి చేతికందినన్ని వజ్రాలు, ఆభరణాలు తీసుకుని కేవలం 45 సెకన్లలో అక్కడి నుంచి పరారయ్యారు. జపాన్, బ్రిటన్ చరిత్రల్లోనే అతిపెద్ద నగల చోరీకి పాల్పడింది ఈ గ్యాంగే. ప్రముఖ హాలీవుడ్ చిత్రం పింక్ పాంథర్‌లో చూపించిన ఓ ట్రిక్‌లాంటిదే చేసి 2003లో లండన్‌లోని ఓ నగల దుకాణంలో వజ్రాలను చోరీ చేశారు. అప్పటి నుంచి ఈ గ్యాంగ్‌కు పింక్ పాంథర్ అని పేరొచ్చింది.

# భారత్‌పై సుంకాలు తగ్గించే యోచన

**ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అమెరికా ఆసక్తి**



వాషింగ్టన్: సుంకాలను తగ్గించేందుకు భారత్ అమెరికాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరనుంది. దీర్ఘకాలంగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందానికి భారత్-అమెరికాలు చాలా దగ్గరగా ఉన్నాయని, దీంతో భారత దిగుమతులపై అమెరికా సుంకాలు 50శాతం నుండి 15 నుండి 16శాతానికి తగ్గనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంధనం, వ్యవసాయంపై ఆధారపడిన ఈ ఒప్పందంతో, క్రమంగా భారత్ రష్యా నుండి ముడి చమురు దిగుమతులు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపాయి. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఈ అంశంపై బుధవారం జాతీయ మీడియాలో ఒక కథనం ప్రచురితమైంది. అమెరికాతో చర్చల్లో భాగంగా, జన్యుపరంగా మార్పులు చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచడానికి భారత్ అనుమతించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొంది. ఈ ఒప్పందంలో సుంకాలు మరియు మార్కెట్ యాక్సెస్‌ను క్రమానుగతంగా సమీక్షించే యంత్రాంగం కూడా ఉండవచ్చని తెలిపింది. ఈ నెలలో జరగనున్న ఏసియన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వైట్‌హౌస్ స్పందించాల్సి వుంది. మంగళవారం భారత ప్రధాని మోడీతో మాట్లాడానని, ఎక్కువగా వాణిజ్యంపై దృష్టిసారించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధనంపై కూడా చర్చలు జరిపామని ఆయన అన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తుందని మోడీ తనకు హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. అయితే ట్రంప్, తాను చర్చలు జరిపామని మోడీ కూడా స్పష్టం చేశారు.

## పాఠశాలల్లో పెండింగ్ అభివృద్ధి పనులు

# వేగంగా పూర్తి చేయాలి

**ఖమ్మం జిల్లా అక్టోబర్ 22 మనసాక్షి :**



పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డులు వివరాలు నమోదు చేస్తే వెంటనే బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. 44 పాఠశాలల్లో పనుల పురోగతి వివరాలను పాఠశాలల వారిగా రివ్యూ చేసి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలకు నీరు సరఫరా లేని పక్షంలో సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి కనెక్షన్ అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల సకాలంలో పూర్తి కాని పక్షంలో సంబంధిత పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారుల వేతనంలో కోత విధించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎం.ఈ.ఓ. లు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆడ మగ నిర్ధారణ చేస్తే జైలుకే



**- వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వాణిశ్రీ**

**పెద్దపల్లి,అక్టోబర్ 22,మన సాక్షి:**

పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పి.సి.పి.యన్.డి.టి. అడ్వైజరి కమిటి సమావేశంను డా. వి. వాణిశ్రీ , జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 32 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయినాయి అన్నారు. వీటిలో ప్రతి నెల 10 కేంద్రాలను తనిఖీ చేస్తూ, అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నాము అని అన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం -1994 (పి. సి. పి. ఎన్.డి.టి.) ప్రకారం పుట్ట బోయే బిడ్డ అడ, మగ అని చెప్పడం నేరం. లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష రూ.10,000/-ల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం ను పకడ్బందిగా అమలు చేయుచున్నది అని అన్నారు. ఈ రోజు రెన్యువల్ కు దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి, డిస్ట్రిక్ట్ అప్రేపియేట్ కమిటీ కి అనుమతించడం కొరకు సిఫారసు చేయడం జరిగింది అని అన్నారు. ఇందులో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రామగుండం దరఖాస్తు కూడా ఉన్నది అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులకు చేసే స్కానింగ్ వివరాలను కూడా ఫారం ఎఫ్ నింపడం ద్వారా వారి వివరాలను పొందుపరిచాలని కమిటీ సభ్యులు, శ్రీ రాజ గోపాల్ కోరారు. జిల్లా సమైక్య గ్రూపు సమావేశం లలో లింగ వివక్షత పై అవగాహన కల్పిస్తామని జిల్లా సమైక్య సంఘాల అధ్యక్షురాలు శ్రీమతి స్నేహ అన్నారు. ఈ సమావేశంలో డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు,పి.రాకేష్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, శ్రీ కె. రాజగోపాల్, రెడ్ క్రాస్ సోసైటి, అద్యక్షులు, స్నేహ శ్రీపతి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు, జగన్ డి. పి.ఆర్.ఓ., ఎస్.వెంకటేశ్వర్లు , జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గోన్నారు.

# మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభం..!

**మిర్యాలగూడ, అక్టోబర్ 22,మన సాక్షి :**

కార్తీక మాసం ప్రారంభం పురస్కరించుకొని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి - మాధవి వివాహ వార్షికోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నందు అయ్యప్ప స్వామి, శివ స్వామి, దుర్గా మాత మాలధారణ చేసిన స్వాములకు అన్న ప్రసాధ వితరణ కార్యక్రమాన్ని బుధవారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ప్రారంభించారు. 2 వేల మంది స్వాములు ఈ అన్నప్రాసధ వితరణ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాధాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం మండల పూజ వరకు కొనసాగుతుందని వారు తెలిపారు. మాలధారణ చేసిన స్వాములు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు జరిగే ఈ అన్నప్రసాధ వితరణ కార్యక్రమంలో పాల్గొనగలరని కోరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్కైలాబ్ నాయక్, పొదిల శ్రీనివాస్, నూకల వేణుగోపాల్ రెడ్డి, శాగ జలంధర్ రెడ్డి, చిలుకూరి బాలు, దేశిడి శేఖర్ రెడ్డి, మొల్లాల అమృత రెడ్డి, గోదాల జానకి రామ్ రెడ్డి, బల్గూరి శ్రీనివాస్, గుడిపాటి నవీన్, సిద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు





# మృతుని కుటుంబానికి పరామర్శ

**శివంపేట,అక్టోబర్ 22,మన సాక్షి:**



శివంపేట మండలంలోని బిక్కియతాండకు చెందిన ధనావత్ ధన్సింగ్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి తన సొంత డబ్బులతో రెండు నెలలకు సంబంధించిన నిత్యవసర సరుకులను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మాజీ జెడ్పిటిసి మహేష్ గుప్తా మాట్లాడుతూ పేదలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని వారి ఆశీస్సులు తనపై ఎప్పటికి ఉండాలని కూడా ఆయన అన్నారు. వారి వెంట మాజీ వార్డు సభ్యులు డి కిషన్ నాయక్ కుటుంబ సభ్యులు నాయకులు తదితరులు ఉన్నారు

# విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణి

**తూప్రాన్, అక్టోబర్ 22,మన సాక్షి:**



మండల కేంద్రం మనోహరాబాద్ లోని ప్రాథమిక పాఠశాలలోని 150 మంది బడి విద్యార్థులకు గ్రామానికి చెందిన బలరాం రాజిరెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు స్టీల్ వాటర్ బాటిల్ ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర సర్పంచ్ ల ఫోరమ్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి హాజరై విద్యార్థుల కు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఎండి జావేద్ పాషా వెంకట్ రెడ్డి, శంకర్, కృష్ణారెడ్డి, తప్పేట శ్రీనివాస్, సోములు, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, హస్మూత్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్, బంటి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## రిటైర్మెంట్ బకాయిలు ఇవ్వాలని క్రొవత్తులతో నిరసన ర్యాలీ

**కోదాడ,అక్టోబర్ 22,మన సాక్షి:**




2024 మార్చి నెల తరువాత రిటైర్ అయిన పెన్షనర్స్ కు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన బకాయులు వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ బకాయుల సాధాన సమితి ఆధ్వర్యంలో క్రొవత్తులతో కోదాడ బాయ్స్ హై స్కూల్ నుండి రంగా థియేటర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.. ఈ ర్యాలీకి టీ. ఎస్. జి. ఆర్ . ఈ. ఏ. కోదాడ యూనిట్ పూర్తి మద్దతు ప్రకటిం చింది. ఈ ర్యాలీ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు రావేళ్ళ సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలనీ లేనిచో ఈ పోరాటంను రాష్ట్ర స్థాయి వరకు తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యవర్గం మరియు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.ర్యాలీని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి పేరు పేరున ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నదానం మహాదానం

**మిర్యాలగూడ అక్టోబర్ 22, మన సాక్షి:**



అన్నదానం మహాదానమని యువకుడు రమావత్ అంజి నాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు పేషెంట్లకు తన సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవ దృక్పథాన్ని కలిగి ఉండాలని కోరారు. సుమారు 50 మందికి భోజనం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాని ,అజయ్, రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరు..సమస్య పరిష్కారం

**దేవరకొండ,అక్టోబర్ 22,మన సాక్షి :**



దేవరకొండ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో వర్షపు నీరు భారీగా చేరడంతో రోగులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద నీరు నిలవడంతో లోపలికి వెళ్లడానికి బయటకు రావడానికి తీవ్ర అవరోధం ఏర్పడింది. రోగులు తమ వాహనాలను నిలిపి ఉంచడానికి కూడా కష్టపడాల్సి వచ్చింది.?ఈ విషయం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవి ప్రకాష్ దృష్టికి వెళ్లగానే ఆయన తక్షణమే స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా శానిటేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.?సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు శానిటైజేషన్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. వారు నిలిచిపోయిన వర్షపు నీరు సాఫీగా పారుదల అయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. డ్రైనేజీ మార్గాలను శుభ్రం చేయడం నీరు నిలిచిన ప్రాంతంలో పారుదలకు వీలు కల్పించడం వంటి పనులు చకచకా చేశారు.?సిబ్బంది కృషి ఫలితంగా కొద్ది సమయంలోనే వర్షపు నీరు మొత్తం పారుదల అయ్యింది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులు సందర్శకులు ఊరట చెందారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రవి ప్రకాష్ తక్షణ చర్యలు తీసుకోవడంపై స్థానికులు రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

# 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు

- రైతుల సంస్థలకు వరి కొనుగోలు కేంద్రాలు
- జోగిపేటలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ



**అందోలు, అక్టోబర్ 22, మన సాక్షి:**

వరి ధాన్యాన్ని సహకార సంఘాలు, ఐకేపీ, డీసీఎంఎస్‌లతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు ముందుకు వస్తే అవకాశం కల్పించి కొనుగోలు కేంద్రాలను పెంచుతామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం జోగిపేటలోని మార్కెట్ యార్డ్ లో సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల సంస్థ అద్వర్యం లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు . రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామన్నారు . దళారులను నమ్మొద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే వరి ధాన్యంను విక్రయించాలన్నారు. . జిల్లాలో 216 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధర కు కొనుగోలు చేస్తున్నామన్నారు . రాష్ట్ర ప్రభుత్వం సన్నాలను ప్రొత్సహించి క్వింటాలకు రూ.500 రూపాయల బోనస్ ను అందిస్తున్నామన్నారు . కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటలలో రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తున్నామన్నారు. అందోల్ నియోజక వర్గం లో ప్రతి గ్రామంలో చెరువు , కుంటలు ఉన్నాయన్నారు . 2005 %-% 06 లో అప్పటి దివంగత వైఎస్. రాజశేఖర్ రెడ్డి సహకారం తో సింగూర్ కాల్వ ద్వారా వల్ల 40 వేల ఎకరాలు సాగుకు నీరందించేందుకు కాల్వల నిర్మాణానికి నిధులను మంజూరు చేసారన్నారు. నియోజక వర్గం లో ఎక్కువ శాతం వరి , పత్తి పంటలను పండిస్తారన్నారు. సాగునీరు , నీటి వ్యవస్థ కు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి , ఆర్డీఓ పాండు , రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మెహన్ రెడ్డి , మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం. జగన్ మోహన్ రెడ్డి , సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్ , చిట్టిబాబు , కళాలి రమేష్ గౌడ్ , సొసైటీ ఛైర్మన్ జీఆర్. నరేందర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా కొమరం భీం జయంతి వేడుకలు

**నిజామాబాద్,అక్టోబర్ 22,మన సాక్షి:**



నిజామాబాద్ వినాయక్ నగర్ లో కొమరం భీమ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఉన్న కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న విట్టల్ రావు,మాజీ జెడ్పిటిసి సభ్యులు బాజిరెడ్డి జగన్, హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం అధ్యక్షులు గాండ్ల రామచందర్ మాట్లాడుతూ కొమరం భీమ్ నిరంకుశ పాలన,దోపిడీ తీరులకు వ్యతిరేకంగా "జల, జంగల్, జమీన్" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం నింపిన వీరుడు కొమరం భీం అని అన్నారు.గిరిజనుల జీవనాధారం అయిన అడవి, భూమి, నీటిని కాపాడటమే భీం గారి లక్ష్యమని కొనియాడారు.సమానత్వం, స్వేచ్ఛ, స్వాభిమానం కోసం ఆయన చూపిన ధైర్యం, దీక్ష నేటి తరం యువతకు స్ఫూర్తిదాయ కమని పేర్కొన్నారు. ఆత్మగౌరవం కోసం పోరాడే ధైర్యాన్ని ఆయన జీవితం నేర్పిందన్నారు. కొమరం భీం అడుగుజాడల్లో నడిచి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు సేవా సంఘం నాయకులు దాత్రి అంజయ్య, అన్నం సాయిలు,శానం పవన్, కుమార్ కొండ శ్రీనివాస్ తౌడ గారి చిన్న విట్టల్,ఎల్ఐసి హనుమాన్లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# కృష్ణ చెక్ పోస్ట్ మూసివేత

**నారాయణపేట టౌన్,అక్టోబర్ 22, మన సాక్షి :**

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నారాయణపేట జిల్లా కర్ణాటక సరిహద్దులోని కృష్ణ చెక్పోస్టును మూసివేయనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి మేఘా గాంధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రవాణా చెక్పోస్టులను మూసివేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అక్టోబర్ 22 సాయంత్రం 5గంటల నుండి చెక్పోస్టులు మూసివేసినట్లు తెలిపారు. చెక్పోస్టుల దగ్గర ఉన్న బోర్డులు, బారికేడ్లు, సిగ్నేజ్, రికార్డులు జిల్లా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

# స్వంత ఖర్చులతో డ్రైనేజీ రంధ్రంపై కప్పు

**అందోలు, అక్టోబర్ 22, మన సాక్షి:**



అందోల్%-% జోగిపేట మున్సిపల్ పట్టణంలోని 17వ వార్డులోని పోచమ్మ ఆలయం సమీపం వద్ద ఏర్పడిన డ్రైనేజ్ సమస్యను 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ పరిష్కరించారు.గత నెల రోజులుగా మురికి కాలువపై ఉన్న పైపులు పగిలిపోయి పెద్ద రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే బుధవారం సొంత నిధులతో పైకప్పు పనులను చేయించారు. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ఈ డ్రైనేజీపై నుంచే దేవాలయం చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సి ఉంటుంది. దీంతో యుద్ధప్రాతిపదికన ఒక్క రోజులో నిర్మాణం చేయించారు. ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ రంధ్రాన్ని మరమ్మత్తు చేయించినందుకుగాను పోచమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల ప్రజలు చిట్టిబాబును అభినందించారు.

# నిలిచిపోయిన కెనరా బ్యాంక్ సేవలు..!




**వెల్దండ, అక్టోబర్ 22, మన సాక్షి:**

మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో గల కెనరా బ్యాంక్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయాయి. కరెంట్ సరఫరా లేకపోవడంతో కంప్యూటర్లు పనిచేయక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు సేవలకు సరిపడ జనరేటర్ లేకపోవడంతో చివరికి డబ్బు కౌంటింగ్ చేయడానికి సైతం కౌంటింగ్ మిషన్ పనిచేయడం లేదు. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ఖాతాదారులతో పాటు బ్యాంకు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే గోల్డ్ లోన్స్ కోసం రోజులు తరబడి బ్యాంకుల వద్ద పడికాపులు కాయాల్సివస్తుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు తక్షణమే స్పందించి బ్యాంకు సేవలకు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

# 108 కలశాలతో శివునికి అభిషేకం

**మేడ్చల్,అక్టోబర్ 22,మన సాక్షి:**



సహస్ర కలశాభిషేక సహిత కోటి బిల్వార్చన ఈ కార్తీకమాస శుభ వేళ మల్కాజిగిరి లో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సహస్ర కలశాభిషేక సహిత కోటి బిల్వార్చన కార్యక్రమం బ్రహ్మ శ్రీ కోట మాధవ శర్మ ఆధ్వర్యంలో అంకురార్పణ దిగ్విజయంగా జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, మహన్యాసం, 108 కలశాలతో శివునికి అభిషేకం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బ్రహ్మ శ్రీ సామవేద షణ్ముఖశర్మ విచ్చేసి అనుగ్రహ భాషణం చేయడం జరిగినది. కార్తీకమాస విశిష్టత,ఈ కార్యక్రమ సంకల్పం గురించి వివరించారు. కోటిబిల్వర్చన ఈ పూజా కార్యక్రమం నేటి నుండి 19 నవంబర్ దాకా ప్రతి రోజు ఉదయం 6.00 గంటలనుండి 12.00 గంటలవరకు నిర్వహిస్తున్నాము, కావున భక్తులు అందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# స్వాతంత్ర సమరయోధుల్లో ఒకరైన అశ్వకుల్లా ఖాన్ జయంతి

**మందమర్రి రూరల్,అక్టోబర్ 22, మన సాక్షి:**



స్వతంత్ర సమరయోధుల్లో ఒకరైన అశ్వకుల్లాఖాన్ జయంతిని 22 బుధవారం రోజున మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాలలో మిలటరీ కార్గిల్ యుద్ధ వీరులు అయిన జవాన్ రాజేష్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అశ్వాకుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పండ్లు విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మిలటరీ జవాన్ రాజేష్ ఖన్నా మరియు ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ అశ్వకుల్లా ఖాన్ 19వందల సంవత్సరం అక్టోబర్ 22 తేదీన ఉత్తర ప్రదేశ్ లోని షాజహాన్ పూర్ లో జన్మించారని అన్నారు 19 వ శతాబ్దంలో మహాత్మా గాంధీ భారత దేశ స్వాతంత్రం కోసం సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చినప్పుడ అశ్వకుల ఖాన్ పాఠశాల విద్యార్థి ఇది అతనిపై చాలా ప్రభావాన్ని చూపింది ఖగోరి రైలు దోపిడిలో చురుకుగా పాల్గొన్నాడని బ్రిటిష్ ప్రభుత్వం అతనిని విప్లవకారుడిగా ముద్రవేసింది ఆ తర్వాత జౌరి చౌర సంఘటన తర్వాత మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విరమించుకున్నారు ఆ సమయంలో భారత యువతులు చాలా నిరాశకు గురయ్యారు అందులో అశ్వకుల్లా ఖాన్ ఒకరు భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిపెట్టే నాయకులకుతో కలిశారనితెలిపారు. అనంతరం ఢిల్లీ వెళ్లారు ఢిల్లీలో పటాన్ స్నేహితులు పోలీసులకు సమాచారం అందించడంవల్ల పోలీసులు అతనిని అరెస్టు చేసి ఫైజాపూర్ జైలులో ఖైదుచేశారన్నారు.డిసెంబర్ 19 1927న అశ్వా కుల్లా ఖాన్ ఉరి తీయబడ్డారని తెలియజేశారు

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.